# రోహిత్ మరణం లేవనెత్తుతున్న ప్రశ్నలకు అర్థఫ్యూడల్ వ్యవస్థలో మూలాలు

**దేశం** 67వ గణతంత్ర దినోత్సవాన్ని జరుపు కోవటానికి కొద్దిరోజుల ముందు జనవరి 17వ తేదీన వెలుగుచూసిన హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ పరిశోధక విద్యార్థి, అంబేద్కర్ విద్యార్థి సంఘం నాయకుడు వేముల రోహిత్ మరణం – రెండు తెలుగు రాష్ట్రాలలోనేగాక, యావద్దేశంలోనూ తీవ్ర సంచలనం కలగజేసింది. పీడిత కులనేపథ్యం, అత్యంత కష్టభరితమైన బాల్యం నుండీ పైకెదిగి, ఉన్నత విద్యనభ్యసించి, పేరుగాంచిన కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పి.హెచ్.డి. చేస్తున్న రోహిత్ 26 సం॥ల వయస్సులో బలవన్మరణానికి పాల్పడటంపట్ల 'జనశక్తి' తీవ్ర విచారం వ్యక్తంచేస్తూ, రోహిత్ కుటుంబసభ్యులకు, అతని సహ విద్యార్థులకు సంతాపం తెలియచేస్తోంది.

ఈ ఘటనకు ఐదు నెలల ముందు కాలం నుండీ యూనివర్సిటీలో జరుగుతున్న పరిణామాల క్రమం, రోహిత్ మరణం తర్వాత లభించిన లేఖ, ప్రసార మాధ్యమాలు, సామాజికమాధ్యమాల ద్వారా విస్తృతంగా వెలుగులోకి వచ్చాయి. ఈ దేశంలో తరాలుగా సాగుతున్న కులవివక్ష, కుల అణచివేత, అంటరానితనం, అగ్రకుల దురహంకారం, హిందూ మతోన్మాదం వంటి దుర్లక్షణాలన్నింటి తీవ్రతనీ రోహిత్ మరణం – మరోసారి చర్చలలోకి తీసుకొచ్చింది. అత్యున్నత మేధో నిలయాలుగా భాసిల్లాల్సిన విశ్వవిద్యాలయాలలో భావప్రకటనా హక్కుపై ఉక్కుపాదం మోపుతూ పీడిత కులాల విద్యార్థులను బలవన్మరణాలకు నెడుతున్న పరిస్థితులపట్ల దేశవ్యాపితంగా ఆందోళనలు పెద్ద స్థాయిలో పెల్లుబికాయి. రోహిత్ ఆత్మ'హత్య'కు కారకులైనవారిని కఠినంగా శిక్షించాలని దాదాపు దేశంలోని విశ్వవిద్యాలయాలన్నింటిలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. జాయింట్ యాక్షన్ కమిటి ఆధ్వర్యంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నిరవధిక నిరాహారదీక్ష చేస్తున్న విద్యార్థి బృందాలను పోలీసులు రెండు విడతలుగా అరెస్టుచేసి ఆసుపత్రులకు తరలించారు. రోహిత్ మృతి వెనువెంటనే ఢిల్లీలో కేంద్ర మానవవనరుల మంత్రిత్వశాఖామంత్రి స్మృతీ ఇరానీ ఇంటివద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న ఢిల్లీ విద్యార్థులను చెదరగొట్టేందుకు పోలీసులు జలఫిరంగులను ఉపయోగించారు; లాఠీఛార్జీకి పాల్పడ్డారు. జనవరి 30న ఢిల్లీలోని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం మీదుగా ప్రదర్శన నిర్వహిస్తున్న జెఎన్‌టియు తదితర విశ్వవిద్యాలయ విద్యార్థులపై పోలీసులు విరుచుకు పడ్డారు. విద్యార్థినులపై మగ పోలీసులు, గూండాలు విచక్షణారహితంగా దాడిచేశారు. దేశవ్యాపితంగా విద్యార్థుల ఆందోళనలు ఇంకా కొనసాగుతున్నాయి. విద్యార్థుల ఆందోళనకు వామపక్ష పార్టీలతోపాటు, కాంగ్రెస్‌తోసహా వివిధ ప్రతిపక్ష పార్టీలు మద్దతు నందించటంతోపాటుగా, ప్రత్యక్ష కార్యాచరణలోనూ పాల్గొన్నాయి. విశ్వవిద్యాలయంలోని అధ్యాపకులలో ఒక సెక్షను, తమ తమ హోదాలకు రాజీనామాచేసి విద్యార్థులకు మద్దతుగా ఆందోళనలో నిలిచారు.

వేముల రోహిత్‌తోపాటుగా మరో నలుగురు విద్యార్థులను నాలుగు నెలల తీవ్ర మానసిక వేధింపుల అనంతరం, గ్రామాలలో సాంఘిక బహిష్కరణ రీతిలో యూనివర్సిటీ నుండి వెలివేశారు. వారు 'వెలివాడ'ను ఏర్పరచుకొని ఆందోళన చేయటానికి, అంతిమంగా రోహిత్ మృతికి కారకుడైన హెచ్‌సియు వైస్‌ఛాన్సలర్ అప్పారావును తక్షణం తొలగించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయ ఏబివిపి నాయకుడు సుశీల్‌కుమార్‌పై రోహిత్ బృందం దాడికి పాల్పడిందని ఆరోపిస్తూ, కులతత్వ, అసాంఘిక, దేశ వ్యతిరేక శక్తులకు యూనివర్సిటీ నిలయంగా మారుతున్నదని, దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కేంద్ర మానవవనరుల మంత్రిత్వశాఖను కోరుతూ లేఖలు రాసిన కార్మికశాఖామంత్రి బండారు దత్తాత్రేయ; ఈ లేఖలకు వెనువెంటనే స్పందిస్తూ 'తగిన' చర్యలు తీసుకోవాలని హెచ్ఆర్‌డి మంత్రిత్వశాఖ కార్యాలయం నుండి యూనివర్సిటీ అధికారులకు పదే, పదే ఆదేశాలనిచ్చిన కేంద్రమంత్రి స్మృతి ఇరానీలు రాజీనామా చేయాలని, వారిపై కేసులు నమోదు చేయాలని; యూనివర్సిటీలలో అధికార రాజకీయ నాయకుల జోక్యానికి ముగింపు పల్కాలని, తమపై తప్పుడు ఆరోపణలతో యూనివర్సిటీలో ఉద్రిక్తతలను పెంచిన ఏబివిపి నాయకుడు సుశీల్‌కుమార్‌పై, ఎమ్ఎల్‌సి రామచంద్రరావులపై కేసు నమోదుచేయాలని, రోహిత్ మృతికి 50 లక్షల రూపాయలు పరిహారంగా అందచేయాలని డిమాండ్ చేస్తూ హెచ్‌సియు జాయింట్ యాక్షన్ కమిటి ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన సాగిస్తూ వున్నారు.

విద్యార్థుల దేశవ్యాపిత ఆందోళన, దీనికి మద్దతుగా దేశ ప్రజలలో, మేధావులలో వెల్లువెత్తుతున్న సంఘీభావం, మీడియా ద్వారా విస్తృతంగా వెల్లడవటంతో, ఆత్మరక్షణలోపడిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకోవలసిన పరిస్థితికి నెట్టబడింది. అందుకు ముందుగా లక్నోలోని అంబేద్కర్ యూనివర్సిటీని సందర్శించిన ప్రధాని మోడీ విద్యార్థుల నిరసన సెగను ఎదుర్కొన్నాడు. 'దేశం ఒక ముద్దుబిడ్డను కోల్పోయిందని' రోహిత్‌ను ఉద్దేశించి మొసలికన్నీరు కార్చాడు. అదే సందర్భంలో రోహిత్ మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని మోడీ సభలో నినాదాలిచ్చిన నేరానికిగానూ లక్నో యూనివర్సిటీకి చెందిన న్యాయశాస్త్ర విద్యార్థులిద్దరిపై సెక్షన్ 151 క్రింద నేరం మోపటం వీరి నైజానికి దర్పణం పడుతోంది.

రోహిత్ మరణంపై విద్యార్థుల ఆందోళనలతో ఒకడుగు వెనక్కు వేసినట్లుగా నటించిన ప్రభుత్వం, యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్‌ను సెలవుపై పంపి; విపిన్ శ్రీవాత్సవను ఇన్‌ఛార్జి విసిగా నియమించింది. అతనికంటే ఘనుడైన ఈ ఆచంట మల్లన్న, గతంలో ఇదే

యూనివర్శిటీలో ఫిజిక్స్ స్కాలర్, దళిత విద్యార్థి అయిన సెంథిల్ కుమార్‌పై వేధింపులకు పాల్పడి, అతని బలవన్మరణానికి కారకుడనే ఆరోపణలుండటమే గాక, రోహిత్ బృందాన్ని శాశ్వతంగా విశ్వవిద్యాలయం నుండి బహిష్కరించాలని ప్రతిపాదన చేసిన యూనివర్శిటీ క్రమశిక్షణా సంఘ ఛైర్మన్ కూడా ఇతనే కావటం గమనార్హం. దీనితో విద్యార్థుల ఆగ్రహం మిన్నంటింది. ఈ ఇన్‌ఛార్జి వి.సి.ని ఎట్టిపరిస్థితిలోనూ ఆమోదించేదిలేదని, యూనివర్శిటీ కార్యకలాపాలను నిరవధికంగా స్థంభింపజేస్తూ వచ్చారు. అంతిమంగా శ్రీవాత్సవను కూడా సెలవుపై పంపి, ఎమ్. పేరయ్య స్వామి అనే మరో సీనియర్ ప్రొఫెసర్‌ను ఇన్‌ఛార్జి వీ.సీ.గా నియమించారు. ఈయన రోహిత్ మృతి విచారకరమని, యూనివర్శిటీలో కొనసాగుతున్న వివక్షే రోహిత్ మృతికి కారణమని ప్రకటిస్తూ పరిస్థితులు చక్కదిద్దుతానంటూ ముందుకు వచ్చాడు రోహిత్ మృతి పూర్వాపరాలపై విచారణ చేసేందుకుగానూ మోడీ ప్రభుత్వం సంయుక్త పార్లమెంటరీ కమిటీని నియమించటంతోపాటు, రిటైర్డ్ న్యాయమూర్తి అశోక్‌కుమార్ రూపన్‌పాల్ ఆధ్వర్యంలో ఏక సభ్య జ్యుడీషియల్ విచారణా కమీషన్‌ను ఏర్పాటుచేసి మూడు నెలల్లోగా నివేదిక సమర్పించాలని కోరింది.

ఇదిలా వుండగా, రోహిత్ మృతిపై అంబేద్కర్ విద్యార్థి సంఘం నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైబరాబాద్ పోలీసులు వి.సి. అప్పారావు, దత్తాత్రేయ తదితరులపై యస్‌సి, యస్‌టి అత్యాచార నిరోధకచట్టం క్రింద కేసు నమోదుచేశారు. అదే సమయంలో ఈ కేసును నీరుగార్చటం కోసం కేసు విచారణ పేరిట సైబరాబాద్ ఉన్నత పోలీసు అధికారులు హుటాహుటిన రోహిత్ తండ్రి జన్మస్థలమైన గురజాల వెళ్ళి, రోహిత్ కులాన్ని వివాదం చేసి మీడియాలో విస్తృత ప్రచారం చేయటం ద్వారా రోహిత్ మృతి ద్వారా వ్యక్తమౌతున్న ఆందోళన తీవ్రతను నీరుగార్చి, కేసును అనవసర విషయంపైకి మళ్ళించేందుకు విఫల ప్రయత్నం చేశారు.

కేంద్రంలో బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వంలో భాగస్వామిగా వున్న, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బిజెపితో కలిసి ప్రభుత్వాధికారంలో వున్న తెలుగుదేశం పార్టీ రోహిత్ ఘటనపై విచారం వ్యక్తం చేయటానికి, నష్టపరిహార ప్రకటనలకు మాత్రమే పరిమితమైంది. కేంద్రప్రభుత్వంతో సన్నిహితంగా మెలగాలనుకుంటున్న తెలంగాణా రాష్ట్రంలోని టిఆర్‌ఎస్ – రోహిత్ మృతి అనంతరం 'జన జాగృతి' కార్యకర్తలచే బండారు దత్తాత్రేయ ఇంటిని ముట్టడి చేయించిన అనంతరం సర్దుకొని రోహిత్ ఘటనకు కారకులైనవారిపై పెట్టిన కేసు నుండి దోషులను రక్షించే పనిలో పడింది. రెండు తెలుగు రాష్ట్రాలలో అధికారంలో వున్న ఇటు తెలుగుదేశం, అటు టిఆర్‌ఎస్ పార్టీల అధినాయకులు రోహిత్ ఘటనపై నోరు మెదపకుండా వుండి గ్రేటర్ హైదరాబాద్ నగరపాలక ఎన్నికలలో నిండా మునిగిపోయారు.

ఈ పరిస్థితులు ఒకవైపు ఈవిధంగా వుండగా, రోహిత్ మరణంచుట్టూ అనేక అంశాలపై విస్తృతంగా చర్చలు సాగుతున్నాయి. బిజెపి అనుయాయ సంస్థలు రోహిత్ కులాన్ని వివాదస్పదం చేయటానికి అధికార యంత్రాంగం, మీడియా ద్వారా తీవ్ర ప్రయత్నాలు చేశారు; చేస్తున్నారు. రోహిత్ మరణానికి తోటి విద్యార్థి సంఘాలే కారణమనే వైపుగా అపోహలు వ్యాప్తిచేసే ప్రయత్నం చేస్తున్నారు రోహిత్ దళితుడు కాకుండా మరో కులానికి చెందినవాడైతే అతడిని బలవన్మరణం వైపు నెట్టిన పరిస్థితులన్నీ ఆమోదయోగ్యమేనన్నట్లు; అతని ఆత్మహత్యను పరిగణలోకి తీసుకోవలసిన అవసరమేమీ లేదన్నట్లుగా బిజెపి అనుంగు సంస్థలు దిగజారుడు ప్రచారాలకు పాల్పడటం హేయమైనది.

ఏమైనా రోహిత్ బలవన్మరణం విషాదకరం; అవాంఛనీయం. ప్రగతిశీల సాహిత్యాన్ని అధ్యయనం చేస్తూ, అంబేద్కర్ భావజాల ప్రేరితుడై, అనేక ప్రజాస్వామిక కార్యాచరణలలో నిలచిన రోహిత్ ఈ కార్యాచరణను మరింత విస్తృతంగానూ, లోతుగానూ సాగించటానికి తన తల్లితో సహా, తమలాగే వివక్ష, అణచివేతలకు గురౌతున్న అభాగ్యుల గురించి; గ్రామీణ ప్రాంతాలలో మరెన్నో ఘోరమైన అణచివేతలకు అనునిత్యం గురౌతున్న అసంఖ్యాక పీడిత ప్రజానీకం గురించి తలపోసి, ఈ సమస్యల మూలాలపై తన దృష్టిని కేంద్రీకరించి వుంటే మరింత శక్తిని కూడగట్టు కోవటానికే ప్రయత్నించేవాడు. అయితే దురదృష్ట కరమైన రోహిత్ 'ఆత్మహత్య'ను కొందరు తెలిసో, తెలియకో ప్రశంసిస్తూ కీర్తిస్తూ ఉద్వేగాలతో కూడి వుండే యువతకు తప్పుడు సంకేతాలిస్తున్నారు.

దోపిడీకి, అన్యాయానికి, దుర్మార్గానికి వ్యతిరేకంగా నడిచే ఉద్యమాలు అందులో పాల్గొన్నవారి మనోధైర్యాన్ని ఇనుమడింపజేసి నిరాశా నిస్పృహలకు లోనుకాకుండా వారిని నిలబెట్టగలగాలి. 'జీనా హైతో మరనా సీఖో... కదమ్ కదమ్ పర్ లడనా సీఖో' (జీవించాలంటే మరణం గురించి తెలుసుకో... అడుగడుగున నువు పోరు నేర్చుకో) అనే నినాద స్ఫూర్తిని యువతలో నింపటం ద్వారానే నిరంతర సంఘర్షణతో, ఆశావహ దృక్పథంతో నిస్పృహకు లోనుకాకుండా వారు పరిస్థితులకు ఎదురీద గలుగుతారు. అన్యాయంపై పోరాటంలో అవసరమైతే విలువైన ప్రాణాలు సైతం అర్పించేందుకు సిద్ధంకావాలి తప్పితే స్వీయ బలిదానాలను నిరుత్సాహపర్చాలి. ఈ కాలంలోనే – ఢిల్లీ జెఎన్‌టియులో పరిశోధక విద్యార్థి ఒకరు తన సమస్యలు పరిష్కరించని అధికారుల వివక్ష కారణంగా, తాను ఆత్మహత్య చేసుకోబోతున్నట్లుగా అధికారులకు ఉత్తరం రాశాడు. తమిళనాడు రాష్ట్రం విల్లుపురం జిల్లాలోని ఓ ప్రైవేటు వైద్య కళాశాలలో విద్యనభ్యసిస్తున్న ముగ్గురు యువతులు తమపై వేధింపుల కారణంగా జనవరి 25న ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఏ సమస్య పరిష్కారానికైనా ఆత్మహత్యలను మార్గాంతరంగా ఎంచుకునే విద్యార్థులలో ప్రబలమౌతున్న ఈ ధోరణిని నిరుత్సాహపరచాలి; బలవన్మరణాలకు పాల్పడటం సరికాదని ప్రబోధించాలి.

మరికొందరు అగ్రకులాధిపత్యం, అగ్రకుల దురహంకారంతో వ్యవహరిస్తున్నవారిని, ప్రజాస్వామికంగా ఆలోచించే అగ్రకులాల వారి నుండి విడగొట్టి చూడకుండా అగ్రకులాలకు, దళితులకు మధ్య సమస్యగా చిత్రీకరిస్తున్నారు.

ఫ్యూడల్ వ్యవస్థలో భాగంగా ఈ దేశంలో వేల సం॥లుగా కొనసాగుతున్న కులవ్యవస్థ ఈనాటికీ దేశంలో బలంగా వేళ్ళూనుకొని వుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో పీడితులు, దళితులపై అగ్రకుల దురహంకారుల దాడులు నిత్యం కొనసాగుతున్నాయి. జాతీయోద్యమ కాలంలోనూ, తదనంతరమూ కమ్యూనిస్టుల నాయకత్వంలో భూస్వామ్య అగ్రకుల దురహంకారుల దాడులు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా అగ్రకుల పేదలతోసహా పీడిత కులాల ప్రజలందరినీ సమీకరించి పోరాటాలు సాగించిన చరిత్ర వుంది. కుల అడ్డుగోడలను అధిగమించి అగ్రకులాలలోని పేదలను, ప్రజాస్వామిక స్వభావం కలవారిని పీడిత, దళిత ప్రజా ఉద్యమాలలో భాగస్వాములను చేయటం, ఈ ఉద్యమాల విజయానికి ఎంతో అవసరం. లేకుంటే వీరిని కూడా అనివార్యంగా శత్రువర్గ శిబిరంలోకి తోసినవారమవుతాం. రోహిత్ ఘటన నేపథ్యంలోనూ దళిత, వెనుకబడిన, మైనారిటీ విద్యార్థి యువజనులను, ప్రజాస్వామికంగా ఆలోచించే అగ్రకుల విద్యార్థులు, ప్రజలను కలుపుకుని రావటం ద్వారానే ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయటం సాధ్యమౌతుంది.

వి.సి.ని తొలగించి, కేంద్రమంత్రులు రాజీనామా చేసి, వారిపై కేసు నమోదు చేయటం వరకు, పరిహార సాధన వరకే మరికొందరు పరిమితం చేయజూస్తున్నారు. రోహిత్ మరణం వంటి ఘటనలో ఖచ్చితంగా తక్షణ కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసి ఉద్యమించవలసిందే. కానీ, సమస్యను అక్కడికి మాత్రమే కుదించరాదు. సర్వత్రా వెల్లడౌతున్న అగ్రకుల దురహంకారం, మతతత్వ దురహంకార రూపాలపై దీర్ఘకాల ఉద్యమానికి సన్నద్ధం కావాలి.

గతంలో వెల్లడైన వివరాలు అలా వుండగా, రోహిత్ ఘటన అనంతరం – ఉన్నతస్థాయి విశ్వవిద్యాలయాల్లో సైతం కులవివక్ష, అంటరానితనం, పీడిత కులాల విద్యార్థులపై వేధింపుల ఘటనలు, వానిగురించి గణాంకాలు అనేకం వెల్లడవుతూన్నాయి.

వీటిని సమాజంనుండి వేరుపడిన విడి అంశాలుగా చూడరాదు. నేటి సామాజిక వ్యవస్థలోని దుష్ట లక్షణాల ప్రతిఫలనాలే విశ్వవిద్యాలయంలోని వికృత పోకడలకు కారణాలుగానున్నాయని గ్రహించాలి. స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పబడుతున్న గత ఏడు దశాబ్దాల కాలంగా కూడా దేశంలోని అధికార, న్యాయ పాలనాధికారు లందరిలో అత్యధికులు అగ్రకుల సంపన్నవర్గాల వారే పాదుకొని ఉన్నారనేది నిర్వివాదం. చట్టాన్ని, న్యాయాన్ని నిర్వచించే క్రమంలో, అమలుచేసే క్రమంలో వీరిలో అత్యధికులు తమ వర్గ ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరిస్తారని, దళిత పీడితవర్గాల పట్ల వివక్ష, అణచివేతలను అమలుచేస్తారనేది కూడా అనుభవం లోనిదే. మరోవైపున, ఈ వ్యవస్థ వర్గస్వభావం మారకుండా ప్రధానులుగా, రాష్ట్రపతులుగా, ముఖ్యమంత్రులు, మంత్రులుగా దళితులు అధికారంలోకి వచ్చినంతమాత్రమే దళితులపై అత్యాచారాలు, దాడులు ఆగుతాయనటం, పీడిత దళిత ప్రజానీకాన్ని మరో రకంగా భ్రమలలో ముంచటమే. మన వేలితో మన కంటినే పొడిచే విద్యలో పాలకులు అరితేరి వున్నారని మరువరాదు.

కేంద్రంలో బిజెపి నాయకత్వంలో ఎన్‌డిఏ కూటమి అధికారంలోకి వచ్చాక దేశవ్యాపితంగా హిందూ మతతత్వ భావజాలాన్ని వ్యవస్థలన్నింటిపై రుద్దడమేగాకుండా, భిన్నమైన ఆలోచనలు, భావప్రకటనలు కలిగి వుండే హక్కును కాలరాచివేస్తోంది. ప్రగతిశీలురు, హేతువాదులపై దాడులు, హత్యలను తీవ్రం చేస్తోంది. మతమైనారిటీలపై మాటల యుద్ధాలు, దౌర్జన్యాలు, భౌతికదాడులు, అనేక ప్రాంతాలలో మతహింసను ప్రోత్సహిస్తున్న ఘటనలనూ అనేకం చూస్తున్నాం. దీనిలో భాగంగానే విద్యను కాషాయీకరించేందుకు, 'నవీన విశ్వవిద్యాలయాల్లో పురాణ కవిత్వా'లనే విద్యా సిలబస్‌గా మార్చివేసేందుకు, తద్వారా అత్యున్నత విద్యాసంస్థలైన విశ్వవిద్యాలయాలపై కూడా తన ఆధిపత్యాన్ని నెలకొల్పేందుకు బిజెపి ప్రయత్నిస్తోంది. ప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థలలోనే పరిస్థితి ఈవిధంగా వుంటే, విశ్వవిద్యాలయాలను పూర్తిగా ప్రైవేటీకరించి పెట్టుబడిదారుల ఎస్టేట్లుగా మలుస్తున్న తర్వాత దళిత, పీడిత కులాల పరిస్థితి మరింత ఘోరంగా మారనుంది.

కులతత్వం, మతతత్వం వంటి ఫ్యూడలిజం రూపాలను తన సామాజిక భూమికగా చేసుకున్న సామ్రాజ్యవాదం ఈ దేశంలో తన దోపిడీని తీవ్రం చేస్తోంది. దోపిడీ పాలకవర్గ పార్టీలన్నీ ఒకరు నాజూకు గానూ, మరొకరు మొరటుగానూ హిందూ మతతత్వ విధానాలను అనుసరిస్తూ వస్తున్నారు. అగ్రకులతత్వాన్ని, మెజారిటీ హిందూ మతోన్మాదాన్ని తమ విధానంగా కొనసాగించే బిజెపి ప్రభుత్వం ప్రజలను నిరంతరం ఈ తన్నులాటల్లో ముంచెత్తుతూ, సామ్రాజ్యవాద దేశాల దోపిడీ నిరాటంకంగా సాగిపోయేందుకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తోంది. మోడీ ప్రభుత్వం సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలకు గులాంగిరీ చేస్తూ, సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థల దోపిడీకి వున్న కనీసపాటి అవరోధాలను ఎత్తివేసి, వారికి ఎన్నో రాయితీలు కల్పించి ఎర్రతివాచీ స్వాగతం పల్కుతోంది. సామ్రాజ్యవాద దోపిడీ తీవ్రమవుతూ వుండటం దీనికి సమాంతరంగానే దేశంలో ఉన్నత సాంకేతిక ప్రచార సాధనాలద్వారా అభివృద్ధి నిరోధక, మతతత్వ, కులతత్వ, ఛాందస భావజాల ప్రచారం, మతోన్మాద హింస పెరగటాన్ని మనం గమనించగలం. హిందూ మతతత్వ శక్తుల దాడులను, దౌర్జన్యాలను, కుటిల ఎత్తుగడలను ఎదుర్కొంటూనే ఇందుకు మూలమైన భూస్వామ్య, సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలను ఎక్కుపెట్టటం ద్వారానే రోహిత్ ఘటన వంటి విషాదాంతాలను నిలువరించటం సాధ్యమౌతుంది.

oooooo